ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025

26న ఎస్‌బిఐ మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పాడేరు / పాడేరు టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బాకూరు ఎట్ పాడేరు బ్రాంచిలో ఈనెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గౌరీ శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బిఐ బాకూరు ఎట్ పాడేరు, అరకువ్యాలీ బ్రాంచ్ సిబ్బంది ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.. 70 వేల బ్లడ్ యూనిట్స్ సేకరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో యువకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అనకాపల్లి యూనియన్ సెక్రటరీ పైలా ప్రసాద్ కోరారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే వారికి గిఫ్ట్ కూపన్స్ అందిస్తామన్నారు.

అరకులోయ: ఎస్‌బిఐ 70వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 26న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక బ్యాంకు శాఖ సెక్రటరీ వంతల అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే శిబిరంలో యువత పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఇతర ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

లేబర్ కోడ్ పుస్తకాలు విడుదల చేస్తున్న చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్లు రద్దు చేయాలని వచ్చేనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కావాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మంగళవారం చింతపల్లి మండలంలో అంగన్వాడి కార్యకర్తలతో కలిసి సిఐటియు ముద్రించిన లేబర్ కోడ్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలు తీవ్రమైన నష్టం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సీనియర్ నాయకులు. అక్కమ్మ. ప్రాజెక్టు కార్యదర్శి రాములమ్మ. సత్యవతి. ప్రసన్న., అంగన్వాడీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో అనంతగిరితోపాటు కోనాపురం, గుమ్మ, వేంగడ, పైనంపాడు కొండిభ, భీంపోలు, పెద్దకోట, జీన్నవాడు, ఎన్ఆర్ పురం, గరుగుబిల్లి, కాశీపట్నం, పెద్ద బిడ్డ 13 పంచాయతీ సర్పంచులకు ఈనెల 26 నుండి 28 వరకు మూడు రోజులపాటు అరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద మూడు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ ఎవివి.కుమార్ తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2025 వార్షిక ప్రణాళిక పై అవగాహన శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణార్థులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళా సర్పంచులు తమ ఆధార్‌కార్డులతో పాటు ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్లతో శిక్షణకు హాజరు కావాలని సూచించారు.

ఆదివాసీ గిరి బాలలను
చదువుకు దూరం చేయొద్దు

- ముగిరిగూడలో మాస్టారును నియమించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర
- విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి నిరసన

మాస్టారి అవతారమెత్తిన సురేంద్ర

విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ ముగిరిగూడ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గిరిబాలలను చదువుకు దూరం చేయొద్దని హెచ్చరించారు. మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల బృందం ఆ గ్రామాన్ని సందర్శించారు.ఉపాధ్యాయుడు లేక ఖాళీగా ఉన్న విద్యార్థులకు ఆదివాసీ గిరిజనసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర కొద్దిసేపు విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ మాట్లాడుతూ ముగిరిగూడ ప్రాథమిక పాఠశాలలో 30 మంది ఆదివాసీ (పివిటిజి) విద్యార్థులు చదువుతున్నారన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు పాఠశాల తెరుచుకోకపోవడంతో ఆదివాసీ బాలలు విద్యకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు ఇటువంటి పాఠశాలల్లో భాషా వాలంటీర్, సిఆర్‌టిలు ఉండడంతో విద్యాబోధన సక్రమంగా జరిగేదని, కానీ ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు భాషా వాలంటీర్లు, సిఆర్‌టిల నియామకం చేపట్టక పోవడంతో ముగిరిగూడ వంటి వందలాది ఏజెన్సీ గ్రామాల పాఠశాలలు నేటికి తెరుసుకోక ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు.తక్షణమే మాతృభాష విద్య వాలంటీర్లు,సిఆర్‌టిలను నియామకం చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కల్యాణ్, సన్యాసిరావు,లచ్చు పాల్గొన్నారు.

రోడ్డుపై నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

టేకులూరు గ్రామానికి రోడ్డు వేయాలని ధర్నా

ప్రజాశక్తి - విఆర్‌పురం: టేకులూరు గ్రామానికి సరైన రహదారి వేయాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. మండల సిపిఎం నాయకులు, ఎంపిపి కారం లక్ష్మి మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా తమ గ్రామంలోకి రావడానికి సరైన రోడ్డు లేదని గత పది సంవత్సరాలుగా రాళ్లు తేలిపోయిన రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోయారు. ఎవరైనా అనారోగ్యం పాలైతే ద్విచక్రవాహనంపై నాలుగు కిలోమీటర్లు కుందులూరు వరకూ తీసుకువెళ్లి అంబులెన్స్‌లో పంపాల్సి వస్తోందని వాపోయారు. ప్రజలు కోరడంతో వారి కోరిక మేరకు రోడ్డుపై బైఠాయించి గంటసేపు ధర్నా నిర్వహించారు. మండల సిపిఎం కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా గ్రామానికి సరైన రోడ్డు కల్పించకపోవడం దారుణమని వెంటనే రోడ్డు వేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు చిన్నబాబు, మండల కమిటి సభ్యులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, వడ్లాది రమేష్, కారం సుందరయ్య పాల్గొన్నారు.

పాఠశాల తెరిచారు సరే.. ఉపాధ్యాయులేరీ ?

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ఎంపిపి పాఠశాల ఎట్టకేలకు మంగళవారం తెరిచారు. ప్రధానోపాధ్యాయురాలు క్రాంతికుమారి విధులకు హాజరుకాకపోవడంపై 'ప్రజాశక్తి' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. పాఠశాల తెరిచారు. విద్యార్థులు 50 మంది హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు క్రాంతికుమారి మాత్రం విధులకు హాజరుకాలేదు. పాఠశాల ఆయా కొర్ర గురువరిని విషయం అడగగా గత పది రోజులగా పాఠశాల తెరవలేదని కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న సూర్యకుమారి కౌన్సిలింగ్‌కు వెళ్లిందని ఆమె తనకు ఫోన్ చేసి పాఠశాల తెరవాలని చెప్పడంతో తాళాలు తీశానని, ఎవరూ రాకపోవడంతో మధ్యాహ్నం తిరిగి తాళాలు వేసానని చెప్పారు. ఈ విషయమై ఎంఇఒ 2 రామన్నను 'ప్రజాశక్తి' వివరణ కోరగా నిబంధన ప్రకారం హెచ్‌ఎం క్రాంతికుమారి విధులకు హాజరు కాకపోవడంతో ఎంఈఓ సత్యనారాయణ 1 దృష్టికి తీసుకువెళ్లి ఆమెకు ఈ నెల వేతనం నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సీనియార్టీ, ప్రతిభ ఆధారంగా బదిలీలు చేపట్టాలి

- గ్రామ సచివాలయాల ఉద్యోగుల వినతి

ఎంపిడిఒకు వినతి ఇస్తున్న గ్రామ సచివాలయాల ఉద్యోగులు

ప్రజాశక్తి-చింతపల్లి: సీనియార్టీ లేదా మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ పద్ధతిలో తమను బదిలీ చేయాలని గ్రామ సచివాలయాల ఉద్యోగులు కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ యువి స్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఐదేళ్ల సేవ పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగులకు సాధారణ బదిలీలలో కూటమి ప్రభుత్వం ఐచ్ఛికాల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల కోరుకున్న చోట బదిలీ రాకపోతుందన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోందన్నారు.

ఉమ్మడి జిల్లాల స్థాయిలో కాకుండా ప్రస్తుత జిల్లాల ఆధారంగా ఉద్యోగుల సొంత జిల్లాలోని మండలాల్లోనే బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం చాలామంది ఇతర జిల్లాలకు తరలిపోయినందున, వారికి తిరిగి సొంత జిల్లాలోని మండలాల్లో సేవలందించే అవకాశం ఇవ్వాలని కోరారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు లభిస్తున్న విధంగా గ్రామ సచివాలయ ఉద్యోగులకూ సొంత మండలాల్లోని ఇతర గ్రామ సచివాలయాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు జిల్లా కలెక్టర్ దృష్టికి తమ విన్నపాలను తీసుకెళ్లాలని ఎంపిడిఒను కోరారు.

ప్రమోషన్లు ఇచ్చాకే బదిలీలు చేపట్టాలి

అనంతగిరి : ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు ప్రమోషన్ ఇచ్చిన అనంతరమే మరోచోటకు బదిలీ చేయాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. మంగళవారం సచివాలయ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు మండల కేంద్రంలో బదిలీ జిఒలతో నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా ఎస్ రవి. నాగార్జున మహేష్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి సచివాలయాల్లో సేవలు అందిస్తున్న తమకు ప్రమోషన్ తర్వాత బదిలీ చేయాలని జిఒలో ఉందన్నారు. అయితే కొన్ని విభాగాల సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు చేయడం సరికాదన్నారు. అంతేకాక తొమ్మిది నెలల కాలపరిమితితో ఏరియర్స్ మంజూరు చేయాలన్నారు. సచివాలయ సిబ్బందిలో కొంతమంది ఏ కేటగిరీకి వస్తారో ప్రభుత్వం ముందుగా స్పష్టం చేయాలన్నారు. రెండేళ్ల ప్రొబేషన్ కనానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఒకే సమయంలో రెండు, మూడు విభాగాల బాధ్యతలు నిర్వహిస్తూ, ఒత్తిడి, మనోవేదనకు గురౌతున్నవారికి ఉపశమనం కలిగించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఒ ఏవివి కుమార్‌కు అందజేశారు కార్యక్రమంలో సిబ్బంది దీపిక, సన్యసమ్మ, గీతకల్పన పాల్గొన్నారు

బదిలీ జిఒ ప్రతులతో సచివాలయాల ఉద్యోగుల నిరసన

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నెల రోజుల్లోగా కొండమొదలు సమస్య పరిష్కరిస్తాం
-సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి- రంపచోడవరం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికి పునరావాసం కల్పించాలని రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ముందు 300 మందితో కొండమొదలు పంచాయతీ సర్పంచ్ వేట్ల విజయ చేపట్టిన నిరసనదీక్ష రెండో రోజు కొనసాగింది. నిన్న ప్రారంభించిన దీక్షకు కొనసాగింపుగా నేడు ధర్నా సభ జరిగింది. ధర్నాకి విచ్చేసిన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు పోరాడుతున్నా ఇప్పటికీ పరిష్కరించలేదని దుయ్యబట్టారు. రాజధాని కోసం వేల ఎకరాల భూమిని సేకరించిన పాలకులు నిర్వాసితులకు మాత్రం భూమిని ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌తో సంఘం నాయకులు, కొండమొదలు పంచాయతీ పెద్దలతో కూడిన ప్రతినిధి బృందం చర్చించి నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని,ఆర్అండ్ఆర్ కాలనీని ప్రత్యేక పంచాయతీగా ప్రకటిస్తామని సబ్‌కలెక్టర్ ఇచ్చిన హామీతో కొండమొదలు పంచాయతీ సర్పంచ్ వేట్ల విజయ దీక్ష విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు ఐనాపురపు సూర్య నారాయణ. నాయకుడు పిట్టా వరప్రసాద్ పిఒడబ్ల్యూ మడకం జోగమ్మ సంఘీభావం తెలిపారు.

కాలనీ క్షేత్ర పరిశీలనకు బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి - చింతూరు: చింతూరు ఐటిడిఎ పిఒ తాడువాయిలో ఇంతకు ముందే భూ సేకరణ చేసి అర్అండ్ఆర్ కాలనీల నిర్మాణం కోసం సిద్ధంగా ఉన్న భూములను చూపించేందుకు కూనవరం మండలంలోని టేకుబాకా గ్రామస్తులకు ఒక్క బస్సు, పేదర్కూర్, పంద్రాజుపల్లి, శబరి కొత్త గూడెం, కొండ్రాజుపేట, కూడలిపాడు గ్రామస్థులకు మరో బస్సు 25న ఏర్పాటు చేశామన్నారు. ఆయా గ్రామాల గిరిజనేతరులు అంతా తాడ్వాయి గ్రామాన్ని సందర్శించి వారి అభిప్రాయం వ్యక్తం చేయాలన్నారు. తదుపరి ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కి పంపడం జరుగుతుందని పిఒ తెలిపారు. విఆర్.పురం మండలంలో ఉన్న గ్రామాల్లో గిరిజనేతరులకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. విఆర్‌పురం మండలంలో షెడ్యూల్ రేపు విడుదల చేస్తామన్నారు.

ఆదివాసీలను మోసగించిన
ట్రస్ట్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

బాధితులతో మాట్లాడుతున్న టిడిపి, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి.-చింతపల్లి: ఆదివాసులను అభివృద్ధి పథంలోకి తీసుకొస్తానని నమ్మబలికి, లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ కోరాబు బాలం పడాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆదివాసి ట్రస్ట్ లో డబ్బులు కట్టి మోసపోయిన బాధిత ఆదివాసి గిరిజనులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసి ట్రస్టులో ఒక్కొక్క ఐడీకి రూ.12,200 చొప్పున జమ చేస్తే, ప్రతినెలా రూ.3,000 చెల్లిస్తానని మాయమాటలు చెప్పి గిరిజనుల అమాయకత్వాన్ని ట్రస్ట్ చైర్మన్ సొమ్ము చేసుకున్నాడన్నారు. గిరిజనుడై ఉండి, తోటి గిరిజనులను నమ్మించి, ఆర్థికంగా మోసగించిన ఆదివాసీ ట్రస్ట్ చైర్మన్‌పై ప్రభుత్వపరంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ఈ వ్యవహారంపై సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, పాంగి ధనంజయ్, సాగిన చిరంజీవి, ట్రస్ట్ వైస్ చైర్మన్ కొయ్యం చిన్నబ్బాయి, కార్యదర్శి మామిడి బాలయ్య, చిక్కుడు అశోక్, అడప విష్ణుమూర్తి పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీల పరిష్కారంపై దృష్టి

తహశీల్దార్లకు డిఆర్‌ఒ పద్మలత ఆదేశం

ప్రజాశక్తి- పాడేరు: రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి 22 మండలాల తాహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీసర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీరించిన ఫిర్యాదులు పరిష్కారం, నీటి తీరువా పన్నులు, అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో గృహ నిర్మాణాల సర్వే, ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని వచ్చిన వినతులు పరిశీలన వంటి అంశాలపై సమీక్షించారు.

గృహ నిర్మాణాలకు వచ్చిన వినతులను పరిశీలించి, నివేదించాలని అన్నారు. భూముల రీసర్వేలో మారేడుమిల్లి, కొయ్యూరు, జి.కె. వీధి మండలాల్లో సర్వే సక్రమంగా జరగడం లేదని, భూముల రీసర్వే వేగవంతం చేయాలన్నారు. మ్యుటేషన్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మ్యుటేషన్లు చేసే ముందు సంబంధిత గ్రామాలకు సమాచారం అందించి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సర్వే ప్రక్రియలో పురోగతి సాధించాలని స్పష్టం చేసారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినా, ప్రజలకు ఇబ్బందులకు గురిచేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, 22 మండలాల తాహశీల్దారులు పాల్గొన్నారు.

ఏటా ముంచుతూ చోద్యం చూస్తున్నారు

- ముంపు సమస్యలపై సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నాగేశ్వరరావు
- వాడి వేడిగా సమావేశం

ప్రజాశక్తి - కూనవరం : ముంపు మండలాల ప్రజలను ముంచుతూ ప్రభుత్వాలు ప్రతి ఏటా చోద్యం చూస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ హేమంత్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. రానున్న గోదావరి వరదలకు నిర్వాసితులకు ఎటువంటి చర్యలు చేపట్టాలని ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా వరదలకు రోడ్డు, విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నారని, చిన్నార్కూర్ నుండి బోదునూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. గతంలో కలెక్టర్ ఆదేశాలు చేసినా ఇప్పటికీ నోచుకోలేదన్నారు. పంచాయితీ పరిధిలోనే బఫర్‌స్టాక్ పాయింట్లు పెట్టాలని డిమాండ్ చేసారు. ఆర్అండ్‌బీ మీదుగా భీమవరం నుండి బురదగూడెం వరకూ విద్యుత్‌లైన్ వేయాలన్నారు. జిల్లా కమిటి సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ వరదలకు ప్రజలు ఇబ్బంది పడకుండా పడవలు ఏర్పాటు చేయాలన్నారు. వరదల్లో మునిగిన ప్రతి ఇంటికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.ఉపాధి కోల్పోతున్న ప్రజలకు ప్రభుత్వమే మూడు నెలలు నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సమావేశ అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. టిడిపి నాయకులు యడవల్లి భాస్కరావు మాట్లాడుతూ విద్యుత్, ఫారెస్ట్ సిబ్బంది సమాచారం రాకపోవడం బాధాకరమని అన్నిశాఖలు సమన్వయంతో పనిచేస్తే ముంపు ప్రాంతాలవారు ఇబ్బంది పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రామాంజనేయప్రసాద్, ఎంపిపి పాయం రంగమ్మ, బండారు సాంబశివ, ఎస్ఐ లతాశ్రీ, సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, భరపాటి ప్రకాష్, చెలికాని ఉమా, సిపిఐ నాయకులు గుజ్జా రామ్మోహనరావు,మండల సర్పంచులు, ఎంపిటిసిలు పలు పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పన

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు అన్నారు. మంగళవారం కొండపల్లి పంచాయతీ తెల్లకొండ గ్రామంలో గిరిజనులకు కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పిఎం (డిఎజూగా) పథకం అమలు చేయడానికి ప్రభుత్వం మండలంలో కొన్ని గ్రామాలు గుర్తించడం జరిగిందన్నారు.

ఈ గుర్తించిన గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో కమిటిలు వేయడం జరిగిందన్నారు. ఈనెల 30వ వరకు డీఏ జూగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పిఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్యసేవలు అందించే విధంగా తగు చర్యలు చేపడతామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వరదలపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - వి ఆర్ పురం: మండలంలోని రేఖపల్లి ఎంపిడిఒ సమావేశం మందిరంలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వల్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో గోదావరి శబరి వరదలపై ముందస్తు సూచనలు, ప్రణాళికల కోసం మండల స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, బోటు లాంచీ యాజమాన్యం అందరితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ ముంపు గ్రామాల బాధితులను సురక్షిత ప్రాంతాలకు ముందుగానే తరలించాలని పునరవాసానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు నిత్యావసర సరుకులు ఇవ్వాలని, గర్భిణులను ముందుగానే ఆస్పత్రికి తరలించాలని ఆమె అన్నారు. సమావేశానికి ఎంపిటిసిలు పూనం ప్రదీప్‌కుమార్, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, వేటి లక్ష్మి కారం, బుచ్చమ్మ, సిపిఎం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల నాయకులు పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామ్మూర్తి వడ్లది. రమేష్ కారం .సుందరయ్య, గుండిపూడి. లక్ష్మణరావు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కారంలక్ష్మి తదితరులు

డ్రగ్స్ మత్తులో చిత్తు కావొద్దు

పోలీసుల ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీలు, మానవహారాలు

పాడేరులో ర్యాలీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పాడేరు/ పాడేరు టౌన్: యువత జీవితం, భవిష్యత్‌ను నాశనం చేసే డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత కావసిఐ డి.దీనబంధు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి నుంచి ఆటో, జీప్ యూనియన్ల డ్రైవర్లు, స్థానిక యువతతో మెయిన్ బజార్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి మహమ్మారిని తరిమికొట్టాలని, గంజాయి, ఇతర మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా యువత జాగ్రత్త పడాలన్నారు. వ్యసనాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు.. ఎస్ఐలు ఎల్.సురేష్, గోవిందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: గంజాయి, మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలలో యువత జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్ఐ డి. శ్రీనివాసరావు అన్నారు. మంగళారం జిల్లా ఎస్‌పిఅమిత్ బర్దర్ ఆదేశాలతో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆటో, జీపు డ్రైవర్లకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్మించారు.. యువత గంజాయి రవాణా, సాగు, మాదక ద్రవ్యాలకు జోలికి పోవద్దని హెచ్చరించారు. ఉద్యోగ అవకాశాలపై దృష్టిసారించి, కుటుంబాలకు అండగా నిలవాలని, కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరావు, కానిస్టేబుల్ గిరి, డొంఒబు, మోటార్ ఫీల్డ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: మాదకద్రవ్యాల వ్యాపారులకు ఆటో, జీప్ యూనియన్ నాయకులు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో ఆటో, జీప్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ కూడలి నుంచి హనుమాన్ జంక్షన్ కూడలి వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, ఆటో,జీప్ యూనియన్ మండల అధ్యక్షుడు సంపరి రమణ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం రామాలయం సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్యాలకి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక యువకులు ఆటోడ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలోని ఆర్టిసి కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం వారపు సంతను పురస్కరించుకుని సిఐ సింహమూర్తి ఆధ్వర్యంలో ఎస్సై వినోద్ అధ్యక్షతన యువతా మేలుకో డ్రగ్స్ వదులుకో చెడు మార్గంలో నడవద్దు సన్మార్గమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువత స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

చింతపల్లిలో...

ఎక్కడైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రంపచోడవరం : డిఎస్పి సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో రంపచోడవరం సిఐ రవి కుమార్, ఎస్సై రంపచోడవరం ఎస్ఐతో పాటు సుమారు 50 మంది రంపచోడవరం ఆటో, జీప్ డ్రైవర్లు యువత గంజాయి డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిఐ రవికుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని గంజాయి రవాణా అమ్మకాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజవొమ్మంగి: యువత మాదక ద్రవ్యాలకు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సిఐ ఎన్. సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. దళిత గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలని, ఉద్యోగఅవకాశాలు అందుపుచ్చుకోవాలని సూచించారు రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చినబాబు పోలీస్‌సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతగిరిలో ఆటో డ్రైవర్లలతో మానవహారం

రాజవొమ్మంగిలో నిర్వహిస్తున్న ర్యాలీ

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : చిన్నారులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: మండలంలోని అరకు, పాడేరు ప్రధాన రహదారి కురిడి పెద్ద బ్రిడ్జి మలుపులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలివి. డుంబ్రిగుడ మండలం అరమ సంతవలస గ్రామానికి చెందిన గిరిజన కుటుంబీకులు తమ చిన్నారులను పాఠశాలలకు పంపించేందుకు అరకులోయ ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలోని పెద్ద బ్రిడ్జి మలుపులో ఆట బోల్తా పడింది. ఎనిమిది మంది చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడగా, ఒకరి కుడి కాలికి తీవ్ర గాయమైంది.క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు 108 కు సమాచారమిచ్చినా, అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో ప్రైవేటు ఆటోలో బాధిత చిన్నారులను వారి కుటుంబీకులు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయితో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ జె.బాలకృష్ణ తెలిపారు. పనోరమహిల్స్ మెయిన్ గేటు ఎదురుగా రోడ్డుపైన వెస్ట్ బెంగాల్‌కు చెందిన అక్తర్ రషీద్‌ను 1.5 కిలోల గంజాయితోపాటు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతనిని విచారించగా పనోరమహిల్స్‌లోని డిఎల్ 66 విల్లాలో అద్దెకు నివాసముంటున్న ఆదిల్ ఆసిఫ్ తన ద్వారా గంజాయి కొనడం అమ్మడం చేయిస్తున్నాడని తెలిపాడని వివరించారు. అక్తర్ రషీద్‌ను మంగళవారం రిమాండ్‌కు పంపించారు. ఆదిల్ ఆసిఫ్‌ను అరెస్టుచేయ్యాల్సి ఉందని తెలిపారు.

పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో చోరీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలోని ప్రగతి జూనియర్ కళాశాల, ఎంఎల్ఎఎస్ డిగ్రీ కళాశాల రెండు విద్యాసంస్థల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దాదాపు రూ.5 లక్షల వరకు నగదు చోరీ జరిగినట్లు ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు, అమేరకు సిఐ గోవిందరావు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరిస్తున్నారు, కాలేజీల్లో అడ్మిషన్ టైం కావడంతో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది, దొంగతనాలు జరిగిన విద్యాసంస్థల వద్ద ఎటువంటి సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోని సీసీ కెమెరాలు ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

బోరు తవ్వకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: జల్ జీవన్ మిషన్ తాగునీటి ప్రాజెక్ట్‌లో భాగంగా చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లవరం గ్రామంలో నూతన బోరుబావి తవ్వకానికి స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో శుద్ధమైన తాగునీటి కొరత నివారణకు ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు నిధులు కేటాయించి, పనులు చేపట్టడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, అధికారులకు గ్రామస్తుల తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పుష్పలత

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ అర్బన్ పరిధి మర్రిపాలెం సెక్టార్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవి.రామలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జివిఎంసి 51వ వార్డు పరిధి గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం పని తీరుపై చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు.

ఎల్‌పిఎంల పరిష్కారానికి దరఖాస్తు చేయండి

సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు

ప్రజాశక్తి పాడేరు : ఉమ్మడికమతాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 30వతేదీలోగా సమీపంలో ఉన్న సచివాలయంలో దరఖాస్తు చేయాలని సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూముల విభజనకు చెల్లించ వలసిన రుసుములో ప్రభుత్వం వెసులు బాటు కల్పించిందన్నారు. గతంలో రూ.550లు గా ఉన్న రుసుమును రూ.50గా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కారానికి శాశ్వత పరిష్కారం కలుగుతుందన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం, అల్లూరి జిల్లా పోలీసులు, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో మహిళల భద్రత, పిల్లలపై జరిగే నేరాలు, సెల్ఫ్ డిఫెన్స్ తీరుతెన్నులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వన్ స్టాప్ సెంటర్ సేవలు, వాటి ఉపయోగాలు వివరించడమే కాకుండా, మహిళలు ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. సెల్ఫ్ డిఫెన్స్ ద్వారా ప్రాణ రక్షణ చేసుకునే మార్గాలను విద్యార్థులకు వివరించారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని పోర్టు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 267వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా రూ.వందల కోట్లు లాభాలు ఆర్జిస్తున్న పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.824 కోట్లు లాభాలు వచ్చాయని, దానిలో నాలుగో వాటా ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెఎస్.కుమార్, గణేష్, శంకర్, బి.జగన్, లక్ష్మణ్, జిసిహెచ్.నాయడు, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ సంతోష్

ప్రజాశక్తి- చింతపల్లి : సాధారణ బదిలీల్లో భాగంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ విభాగానికి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ సంతోష్ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా వి. మాడుగుల మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన సంతోష్, తాజాగా బదిలీపై చింతపల్లి ఆసుపత్రిలో విధులు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేసినప్పుడే మెరుగైన ఆరోగ్య సేవలు అందవచ్చని అభిప్రాయపడ్డారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

టేకులూరు పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని కుందులూరు పంచాయతీ పరిధిలోనిటేకులూరు గ్రామాన్ని మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి తనిఖీ చేశారు. స్థానిక గ్రామపెద్దలు విద్యా కమిటి చైర్మన్ తదితరులు పాఠశాల పరిస్థితిపై వివరించారు. దాదాపు పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని ఇంకా కొత్తవారు చేరేందుకు అవకాశం ఉందన్నారు. వీరందరికీ ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారని విధినిర్వహణలో భాగంగా ఆన్‌లైన్ లేదా సమావేశం కోసం బయటకు వెళితే మరో ఉపాధ్యాయుడు స్కూలులో లేకపోవడం వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మరో ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. స్పందించిన ఎంపిపి ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక విద్యాకమిటి చైర్మన్ గ్రామపెద్దలు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సోయం చిన్నబాబు మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- రంపచోడవరం : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష పేర్కొన్నారు. మంగళవారం రంపచోడవరం మండలంలోని డివి కోట గ్రామ సచివాలయంలో ఖరీఫ్ రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా రైతులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు.. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, టిడిపి మండల కారం సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, అడబాల బాపిరాజు, చర్పంచ్ వంతల అచ్చియమ్మ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యం మామిడి పండ్లకు భలే గిరాకీ

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు ఏజెన్సీలో గిరిజనులు స్వతహాగా ఎటువంటి రసాయనలు వాడకుండా చెట్లపై మగ్గిన మామిడ పండ్లను మండల కేంద్రానికి తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. మంచి దిగుబడి నాణ్యత కలిగిన మామిడి మొక్కలను గిరిజనులు సాగు చేస్తున్నారు. గతంలో కేవలం అడవి మామిడి మాత్రమే లభించేవి. కానీ నేడు పలు రకాల మామిడి పండ్లు సాగుచేసి ఫల సాయం పొందుతున్నారు. బంగినపల్లి, కలెక్టర్, రసాలు, వంటి మామిడి పండ్లు విక్రయిస్తున్నారు.

మామిడిపండ్లు విక్రయిస్తున్న గిరిజనులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఉద్యోగ, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఆశ్రమజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన పర్యవేక్షించారు. తాను ఎమ్మెల్సీగా గెలిచేందుకు కృషి చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు అభినందనలు తెలిపారు. తొలుత ఆయా పాఠశాలల్లో సిబ్బంది ఎమ్మెల్సీ గోపిమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా పాఠశాలలో సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ,శ్రామికుల వర్గ పరిరక్షణకు,వారి సమస్యలు గుర్తించి వాటిని శాసనమండలిలో లేవనెత్తి పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల బాగోగులు చూసేందుకు రెగ్యులర్ వార్డెన్, ఎఎన్ఎం ఉండాలని, అలాగే ఆశ్రమ పాఠశాలల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా జనరేటర్లు కూడా లేవని, తాగునీరు ఇతర మౌలిక వసతులు, భవనాలు చాలా చోట్ల శిధిలమై ఉన్నాయని ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాలల్లో సీఆర్టీలు ఉపాధ్యాయుల ఇబ్బందులపై దృష్టి సారిస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపి మూర్తి

ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సాయం

స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఈకా గోపి సంతాపసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ గోపిమూర్తి మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబానికి యుటిఎఫ్ కుటుంబ సంక్షేమనిధి రూ.3 లక్షలు చెక్కును కుటుంబసభ్యులకి అందజేశారు. ఎంఈఓ సత్యనారాయణదొర. యుటిఎఫ్ నాయకులు శ్రీను, డి. పైడిమల్లు, పి. రమణ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలి

- అధికారులకు సచివాలయ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: జిఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్ కల్పించాలని అల్లూరి జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం అధికారులకు విన్నవించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న జిఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులకు తమ సొంత మండలాల్లో పోస్టింగులు కల్పించడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, తమ కుటుంబాలకు దగ్గరగా ఉండి మరింత సమర్థంగా సచివాలయాల్లో సేవలు అందించడానికి దోహదపడుతుందని ఈ విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావుకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, కిషోర్, ఎడ్యుకేషన్ మెంబర్స్ సుధీర్, యూనియన్ నాయకులు వెంకటేష్,భరత్ తదితరులు పాల్గొన్నారు..

ఎంటిఎస్‌లకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకూ కౌన్సిలింగ్ నిలిపివేయాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,విద్యాశాఖ కమిషనర్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎంటిఎస్ 2008, 1998 జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వెంకటపతిరాజు మాట్లాడుతూ, రెండేళ్లుగా ఏజెన్సీలో పనిచేసిన తమను మళ్లీ సాధారణ బదిలీలలో ఏజెన్సీకే పంపిస్తున్నారని ఇప్పటికే 98 మంది ఎంటిఎస్ ఉద్యోగులను మైదాన ప్రాంతాల బదిలీ చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలు చేస్తూ తరచూ అనారోగ్యాలకు గురై వైద్య ఖర్చులు పెట్టుకోలేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎంటిఎస్‌లు

ఎంఎన్‌ఒకే స్వీపర్ బాధ్యతలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వాసుపత్రిలో స్వీపరు లేకపోవడంతో ఆసుపత్రిలో ఎంఎన్ఓ రాజారావు ప్రతిరోజు ఆసుపత్రి క్లీనింగ్ పనులు కూడా తానే చేస్తున్నారు. బొడ్డగండి పంచాయతీ ఎఒబి సరిహద్దు ప్రాంతాలు నుంచి ప్రతిరోజు 40 నుంచి 70 మంది వరకు, ఆదివారం సంత రోజు సుమారు వందమంది రోగులు వస్తుంటారు. దీనిని 24 గంటల ఆసుపత్రి గా అధికారులు అప్‌గ్రేడ్ చేశారు. ఆసుపత్రికి స్వీపర్‌ను నియమించకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్లగా ఎంఎన్ఓ రాజారావు ఆసుపత్రిని కూడా శుభ్రపరుస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఐటిడిఎ పిఒకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఎంఎన్ఓ రాజారావే ఆ పని కూడా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆసుపత్రి పరిశుభ్రపరచడానికి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

పిహెచ్‌సి శుభ్రపరుస్తున్న ఎంఎన్ఓ రాజారావు

26న స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్: మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, ఐసిడిఎస్‌ల నిర్వహణ, గర్భిణులకు, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత తదితర అంశాలపై గురువారం విశాఖ వేదికగా ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఆర్‌జెడి జి.చిన్మయిదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 3 గంటల వరకూ ఎయు ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్ మీటింగ్ హాలులో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిడిలు, సిడిపిఒలు, ఎసిడిపిఒలు, అంగన్‌వాడీలు తదితరులు భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా కార్యక్రమానికి హాజరు కానున్నారని ఆమె తెలిపారు.

29న అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై సదస్సు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం అభివృద్ధి నిధులు, సంస్కరణలు అనే అంశంపై ఈ నెల 29న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి జి.రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, విజయవాడ ఎంబివికె చైర్మన్ పి.మధు, ఎ.వి.పట్టణ పౌరసమైఖ్య సిహెచ్ బాబురావు,సిపిఐ జివిఎంసి ఫ్లోర్ లీడర్ ఎ.జె స్టాలిన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఎం జివిఎంసి ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఎన్.ప్రకాశరావు(వార్వా), పి.నారాయణమూర్తి (నివాస్) ప్రసంగిస్తారని తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితి, ఏ చర్యలు చేపడితే నిజమైన అభివృద్ధి జరుగుతుందన్న అంశాలను చర్చించడానికి ఉద్దేశించబడిన ఈ సదస్సుకు విశాఖ పౌరులు పెద్దసంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కమిటి సభ్యులు బుజ్జి, సిహెచ్ సత్యనారాయణ, విల్లాజీ, టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జి.రాజేశ్వరరావు తదితరులు

పోలీస్‌స్టేషన్‌లో అన్ని మతాల దేవుళ్ల ఫొటోలు ఏర్పాటు చేసిన దృశ్యం

పోలీస్‌స్టేషన్ ఆవరణే సమభావన కేంద్రంగా..

ప్రజాశక్తి - వై.రామవరం: స్థానిక పోలీస్‌స్టేషన్లో అన్ని మతాల వారి విగ్రహాలు, ఫోటోలు ఏర్పాటు చేసి అంతా సమానమేననే భావన కల్పిస్తున్నారు పోలీసులు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆలయంలా తయారు చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులను ఆహ్వానించారు. వచ్చిన వారికి భోజన సౌకర్యాలు కూడా కల్పించారు. కార్యక్రమంలో కమాండర్ పార్ట్ టు బెటాలియన్ సి ఆర్‌పిఎఫ్ ధర్మ ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ వినోద్ చంద్ర పాండే, ఎస్ఐ రామకృష్ణ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.